## క్లుప్తంగా

### నేడు సోషల్ వెల్ఫేర్‌లో స్పాట్ కౌన్సెలింగ్

**శాయంపేట :** మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో ఇంటర్ విద్యార్థులకు గురువారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ రజని బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీసీ, బైపీసీలో సీట్లు ఖాళీగా ఉన్నాయని, పదో తరగతిలో సాధించిన మార్కుల ఆధారంగా సీట్లు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థినులు పదో తరగతి మెమో, కుల ధ్రువీకరణ పత్రం, ఈ ఏడాదికి సంబంధించిన ఆదాయ ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు జిరాక్స్, జనన ధృవీకరణ ఒరిజినల్ పత్రాలతో ఉదయం 9గంటలకు హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

**మోడల్ స్కూల్‌లో..**

**కమలాపూర్ :** మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్‌లో ఆరు నుంచి పదో తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లను భర్తీ చేయనున్నట్లు ప్రిన్సిపాల్ అనిత బుధవారం ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఆగస్టు 1, 2వ తేదీల్లో స్పాట్ అడ్మిషన్లు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాఠశాలకు హాజరుకావాలని కోరారు. స్పాట్ అడ్మిషన్లలో సీట్లు పొందిన విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ తెలిపారు.

### లయన్స్‌క్లబ్ ఇన్‌స్టాలేషన్



**ఆత్మకూరు :** మండల కేంద్రంలోని లయన్స్ క్లబ్ ఆఫ్ దేశాయ్ ఆత్మకూరు ఐదో ఇన్‌స్టాలేషన్ కార్యక్రమం బుధవారం హనుమకొండలో జరిగింది. అధ్యక్షుడిగా ఏరుకొండ రవీందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా శివప్రసాద్, కోశాధికారిగా వెంకటేశ్వర్లు నియామకమయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ బాధ్యతలు స్వీకరించారు. జిల్లా గవర్నర్ డాక్టర్ చంద్రశేఖర్ ఆర్య, సుధాకర్‌రెడ్డి, హరికృష్ణరెడ్డి, సోమయ్య, రాజేందర్, ఆత్మకూరు క్లబ్ చార్టర్ ప్రెసిడెంట్ సత్యనారాయణ పాల్గొన్నారు.

### పరామర్శ



**ఐనవోలు :** మండలంలోని వనమాలకనపర్తి గ్రామానికి చెందిన దూసరి కోమల అనారోగ్యంతో మృతిచెందారు. విషయం తెలుసుకున్న టీజీ క్యాబ్ చైర్మన్ మార్నేని రవీందర్‌రావు బాధిత కుటుంబాన్ని బుధవారం పరామర్శించారు. కోమల మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

### మెడికవర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు

**కాజీపేట అర్బన్:** హంటర్‌రోడ్డులోని మెడికవర్ ఆస్పత్రిలో ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులోకి తీసుకొచ్చినట్లు మెడికవర్ ఆస్పత్రి యాజమాన్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్యశ్రీ పథకంలో భాగంగా మెడికవర్ ఆస్పత్రి వేదికగా న్యూరో సర్జరీ, న్యూరాలజీ, కార్డియాలజీ, సీటీవీఎస్ సర్జరీ, యూరాలజీ, నెఫ్రాలజీ, సర్జికల్, అంకాలజీ తదితర ప్రత్యేక వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పేర్కొంది.

### కరపత్రం ఆవిష్కరణ

**కాజీపేట అర్బన్:** ఆగస్టు 5వ తేదీన ఉపాధ్యాయ సంఘాల ఆధ్వర్యంలో చేపట్టనున్న ధర్నా కరపత్రాలను ఎంఈఓ మనోజ్‌కుమార్, ఉపాధ్యాయులు కాజీపేట మండలం కడిపికొండ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బుధవారం ఆవిష్కరించారు. ఈ మేరకు పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంఈఓ మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి హనుమకొండలోని ఏకశిల పార్కు వద్ద తలపెట్టిన ధర్నాలో ఉపాధ్యాయులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్.రవీందర్‌రాజు, కార్యదర్శి సదానందం, రాజగోపాల్, సురేందర్‌రెడ్డి, వెంకటరమణ, జయశ్రీ పాల్గొన్నారు.

### అగ్ని ప్రమాదాలపై అవగాహన అవసరం

**ఖిలా వరంగల్:** అగ్ని ప్రమాదాల నివారణపై ప్రజలు, ప్రయాణికులు అవగాహన కలిగి ఉండాలని ఆర్పీఎఫ్ అసిస్టెంట్ సెక్యూరిటీ కమిషనర్ ఆర్.సుభాష్, డిప్యూటీ సూపరింటెండెంట్ కృపాకర్ సూచించారు. వరంగల్ రైల్వే స్టేషన్ ప్రాంగణంలో వరంగల్ జిల్లా అగ్నిమాపక శాఖ, ఆర్పీఎఫ్, జీఆర్పీ సంయుక్త ఆధ్వర్యంలో అగ్ని ప్రమాదాలపై నివారణ చర్యలు, జాగ్రత్తలపై ప్రయాణికులకు అవగాహన కలిస్తూ మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అగ్ని ప్రమాదాలు సంభవించకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ గౌడ్, జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సురేందర్, ఇంతేజార్‌గంజ్ ఇన్‌స్పెక్టర్ సుబ్ర, మట్టెవాడ ఫైర్ స్టేషన్ అధికారి నవీన్, ఆర్పీఎఫ్ ఎస్సైలు, రైల్వే వివిధ విభాగాధిపతులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో సమస్యల తిష్ట



రాపాకపల్లి పాఠశాలలో ఏర్పాటు చేసిన నర్సరీ



మరమ్మతుకు నోచుకోని టాయిలెట్ల డోర్లు

- రాపాకపల్లి స్కూల్‌లో నర్సరీ ఏర్పాటు
- సంచరిస్తున్న విషపురుగులు
- దేవునూరు పాఠశాలలో మరమ్మతుల్లో టాయిలెట్స్
- ఇబ్బందులు పడుతున్న విద్యార్థినులు

**ధర్మసాగర్ :** ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యతో పాటు సౌకర్యాల కల్పనలో పెద్దపీట వేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటిస్తున్నా మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో సౌకర్యాల లేమితో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారనే విమర్శలు వస్తున్నాయి.

**రాపాకపల్లి పాఠశాలలో..**

రాపాకపల్లి ప్రభుత్వ పాఠశాల ప్రాంగణంలో నర్సరీ ఏర్పాటు చేయడంతో పాటు గ్రామ ప్రజలకు తాగునీటి సరఫరాకు వాటర్ ట్యాంకు నిర్మాణం చేపట్టారు. దీని కారణంగా పాఠశాలలో నిత్యం విషపురుగులు సంచరిస్తున్నాయి. ఇటీవల పాఠశాలలో బెంచీలు లేకపోవడంతో విద్యార్థులు కింద కూర్చొని చదువుకుంటుండగా నాగుపాము సంచరించింది. గమనించిన ఉపాధ్యాయులు పామును పట్టించి బయటపడేయగా ప్రమాదం తప్పిందని విద్యార్థుల తల్లిదండ్రులు తెలిపారు. పాఠశాలలో ఏ ప్రమాదం జరుగుతుందోననే భయంతో విద్యార్థులు పాఠశాలకు రావడం మానేస్తున్నట్లు తెలిసింది. అదే విధంగా పాఠశాలకు ముందుభాగంలో గోడ నిర్మించకపోవడంతో పశువులు, కుక్కలు సైతం పాఠశాలలో సంచరిస్తున్నాయని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాలకు కేటాయించిన కొద్దిపాటి స్థలంలో నర్సరీ, వాటర్‌ట్యాంకు ఉండడంతో పాఠశాల ఇరుకుగా ఉందని, చదువుపై శ్రద్ధ వహించలేకపోతున్నట్లు విద్యార్థులు చెప్పారు. టాయిలెట్స్‌ను నర్సరీకి అవతలభాగంలో నిర్మించడంతో విషపురుగుల భయంతో విద్యార్థులు జంకుతున్నారు.

**దేవునూర్ పాఠశాలలో..**

దేవునూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సౌకర్యాల లేమితో ఇబ్బందులు పడుతున్నట్లు విద్యార్థులు తెలిపారు. బెంచీలు తుప్పుపట్టాయని, వాటి నుంచి తెల్లటి పౌడర్, చిన్నచిన్న పురుగులు వస్తుండడంతో కూర్చోవాలంటే భయం వేస్తుందని విద్యార్థులు వాపోతున్నారు. పాఠశాల ప్రాంగణంలో బాలికల సౌకర్యార్థం నిర్మించిన టాయిలెట్స్ తలుపులు దెబ్బతిన్నాయని బాలికలు వాపోతున్నారు. మధ్యాహ్న భోజనం తయారీ చేసేందుకు నిర్మించిన గది చిన్నగా ఉండడంతో ఇబ్బందులు తప్పడం లేదని మధ్యాహ్న భోజన కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు, అధికారులు స్పందించి ప్రభుత్వ పాఠశాలల్లోని సమస్యలను పరిష్కరించాలని విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. మౌలిక సదుపాయాలు కల్పించాలంటున్నారు.

## తెలుగు భాషను కాపాడాలి



మాట్లాడుతున్న సారయ్య నాయక్

**శాయంపేట :** తెలుగు భాషను కాపాడుకోవాల్సిన అవసరం ఉందని పెద్దకోడెపాక కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయుడు సారయ్య నాయక్ అన్నారు. బుధవారం పెద్దకోడెపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రాథమికోన్నతస్థాయి తెలుగు కాంప్లెక్స్ సమావేశం జరుగగా ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రతీ విద్యార్థి అక్షర దోషాలు లేకుండా తెలుగులో స్వీయ రచన చేసే స్థాయికి ఎదిగేలా ప్రతి ఉపాధ్యాయుడు కృషిచేయాలన్నారు. విద్యార్థుల బేస్‌లైన్ స్థాయి, మాదిరి పాఠ్య ప్రణాళిక, బోధనలో సాంకేతిక వినియోగంపై ఉపాధ్యాయులతో చర్చించారు. కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ రాజు, మాధవి, డీఆర్పీ రాజేంద్రప్రసాద్, పరకాల, నడికూడ, శాయంపేట మండలాల్లోని తెలుగు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## ఎంబీబీఎస్ విద్యార్థినికి చేయూత



**పరకాల :** జయశంకర్ భూపాలపల్లిలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించిన మారేపల్లి రేణుకు స్వేరో వరంగల్ ఉమ్మడి జిల్లా కమిటీ చేయూతనిచ్చింది. వెంకటాపూర్‌కు చెందిన రేణు తండ్రి మరణించగా, తల్లి ఓ ప్రైవేటు సంస్థలో పనిచేస్తుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె ఎంబీబీఎస్ సీటు సాధించగా ఆర్థిక పరిస్థితులు వెంటాడుతున్నాయి. విషయం తెలుసుకున్న పరకాల పట్టణానికి చెందిన స్వేరోస్ ఇంటర్నేషనల్ వరంగల్ ఉమ్మడి జిల్లా నాయకుడు బొచ్చు రాజుస్వేరో ఆధ్వర్యంలో సదరు విద్యార్థినికి రూ.21వేల ఆర్థిక సాయం అందించారు. రేణు డాక్టర్ పట్టా పొందే వరకు స్వేరో అండగా ఉటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్వేరో నాయకులు రాజేంద్రప్రసాద్, చక్రి, అర్జున్, విజయ్, శివశంకర్, సనత్, సచిన్, ఆనంద్, దినేష్, తిరుపతి, ప్రవీన్, వేణుతో పాటు తదితరులు పాల్గొన్నారు.

**పదో తరగతి విద్యార్థుల ఆర్థికసాయం**

**ఐనవోలు :** మండలంలోని కొండపర్తి గ్రామానికి చెందిన బైరి కాంతమ్మ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. కాంతమ్మ కుమార్తె రాధిక పదో తరగతి స్నేహితులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. రూ.16,116 ఆర్థికసాయం అందించారు. కిరణ్, శంకర్, సురేష్, గణేశ్, నాగరాజు, కృష్ణంరాజు, చిరంజీవి ఉన్నారు.

**ఎల్ఐసీ ఏజెంట్ల ఆర్థికసాయం**



**కమలాపూర్ :** మండలంలోని మర్రిపల్లిగూడెనికి చెందిన ఎల్ఐసీ ఏజెంట్ మాసు రాజు ఇటీవల మృతిచెందాడు. కాగా బాధిత కుటుంబాన్ని హుజూరాబాద్ ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమ సంఘం అధ్యక్షుడు పంజాల ప్రభాకర్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి చందుపట్ల నర్సింహరెడ్డి, కోశాధికారి బాలసాని రవీందర్ బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా బాధిత కుటుంబానికి ఎల్ఐసీ ఏజెంట్ల సంక్షేమ సంఘం తరఫున రూ.25 వేల ఆర్థికసాయం అందజేశారు. సభ్యులు రమేశ్, శ్రీనివాస్, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## సమాజంలో జర్నలిస్టుల పాత్ర కీలకం

**బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామ్‌గోపాల్‌రెడ్డి**



పాత్రికేయుడిని సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

**ఎల్కతుర్తి :** సమాజ శ్రేయస్సులో జర్నలిస్టుల పాత్ర కీలకమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కొమటిరెడ్డి రామ్‌గోపాల్‌రెడ్డి అన్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలం ముల్కనూరులో ఆ పార్టీ జిల్లా కౌన్సిల్ సభ్యుడు పైడిపెల్లి పృథ్వీరాజ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులకు సన్మాన కార్యక్రమం నిర్వహించగా ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వానికి, ప్రజలకు నడుమ వారధులుగా జర్నలిస్టులు వ్యవహరిస్తారని అన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సహకారంతో ప్రెస్‌క్లబ్ నిర్మాణానికి కృషిచేస్తామని చెప్పారు. జర్నలిస్టుల సంక్షేమానికి బీజేపీ కృషిచేస్తుందని అన్నారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అనంతరం జర్నలిస్టులకు శాలువాలు కప్పి జ్ఞాపికలు అందించారు. బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్, కొమురయ్య, లక్ష్మారెడ్డి, అశోక్‌రెడ్డి, కవిత, రాజు, పృథ్వీ తదితరులు పాల్గొన్నారు.

## క్రైం కార్నర్

### చికిత్స పొందుతూ యువకుడి మృతి



కిరణ్(ఫైల్)

**వేలేరు :** కడుపునొప్పి భరించలేక పురుగులమందు తాగిన యువకుడు చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందాడు. ఈ ఘటన మండలంలోని శాలపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. శాలపల్లి గ్రామానికి చెందిన తూముల కిరణ్ (22) ఇంటర్ పూర్తిచేసి ఇంటివద్ద ఉంటున్నాడు. కాగా గతంలో కిరణ్‌కు కడుపునొప్పి రావడంతో తల్లిదండ్రులు ఆపరేషన్ చేయించారు. అయినా కడుపునొప్పి తగ్గకపోవడంతో ఈనెల 21వ తేదీన ఇంటివద్ద ఎవరూ లేని సమయంలో కిరణ్ పురుగులమందు తాగాడు. గమనించిన చుట్టపక్కలవారు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి వరంగల్ ఎంజీఎంకు తరలించారు. ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతుడి తండ్రి తూముల సంపత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### గీత కార్మికుడికి గాయాలు



**కమలాపూర్ :** మండలంలోని మాదన్నపేటకు చెందిన జనగాని ఓదెలు అనే గీత కార్మికుడు మంగళవారం సాయంత్రం ప్రమాదవశాత్తు తాటి చెట్టుపై నుంచి కిందపడి తీవ్రంగా గాయపడ్డారు. గౌడ సంఘం అధ్యక్షుడు రఘుపతి తెలిపిన వివరాల ప్రకారం.. కుల వృత్తిలో భాగంగా ఓదెలు ఈనెల 29న సాయంత్రం తాటిచెట్టు ఎక్కి కల్లు తీస్తుండగా ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో ఓదెలుకు తీవ్ర గాయాలు కాగా వెంటనే హనుమకొండలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు.

### ఒకరిపై కేసు

**వేలేరు :** శంషాబాద్‌లోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో రెండు ప్లాట్లు ఇప్పిస్తానని చెప్పి ఇద్దరు వ్యక్తుల నుంచి రూ.9 లక్షలు వసూలు చేసిన ఇట్టబోయిన భూపతిరాజుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సురేష్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. మెద్చల్ జిల్లా షామీర్‌పేటకు చెందిన జమ్మి పద్మ, కుమార్‌ను శంషాబాద్‌లోని ఓ రియల్ ఎస్టేట్ వెంచర్‌లో తక్కువ ధరకు రెండు ప్లాట్లు ఇప్పిస్తానని వేలేరు మండల కేంద్రానికి చెందిన ఇట్టబోయిన భూపతిరాజు రెండు దఫాలుగా రూ.9 లక్షలు తీసుకున్నట్లు బాధితులు తెలిపారు. ప్లాట్లు రిజిస్ట్రేషన్ చేయకపోవడంతో డబ్బులు ఇవ్వాలని ఒత్తిడి తీసుకొచ్చామని, దీంతో కొంతకాలం గడిచిన తర్వాత రూ.3.50లక్షలు తిరిగి ఇచ్చాడని, మీగితా డబ్బులకు బాండ్ పేపర్ రాసిచ్చినట్లు తెలిపారు. రెండు సంవత్సరాలు గడిచినా మిగితా డబ్బులు ఇవ్వడం లేదని బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

### జేబు దొంగల అరెస్ట్



**శాయంపేట :** మండలంలోని కొత్తగట్టు సింగారం స్టేజీ వద్ద జేబు దొంగల ముఠాను అరెస్ట్ చేసినట్లు ఎస్సై జక్కుల పరమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కొత్తగట్టు సింగారంలో పెట్రోలింగ్ చేస్తున్న క్రమంలో ముగ్గురు అనుమానాస్పదంగా కనిపించినట్లు తెలిపారు. పోలీసులను చూసి పారిపోతుండగా వెంబడించి పట్టుకుని విచారించామన్నారు. ఇటీవల జరిగిన మాజీ మంత్రి కేటీఆర్ పర్యటనలో జేబు దొంగతనాలు చేసినట్లు ఒప్పుకున్నారని చెప్పారు. వారి వివరాలు అడుగగా హనుమకొండ న్యూ రాయపురకు చెందిన కాసుకుర్తి శివ (సాయి వర్ధన్), ఆత్మకూరు మండలం మలక్‌పేటకు చెందిన బుస్స కుమార్, శాయంపేట మండలం ప్రగతి సింగారానికి చెందిన బండి కుమార్‌గా తెలిపినట్లు పేర్కొన్నారు. వారు దొంగిలించిన రూ.35,050, రెండు బైక్‌లను పంచుల సమక్షంలో పంచనామా నిర్వహించి సీజ్ చేసి వారిని అరెస్ట్ చేసినట్లు ఈ సందర్భంగా వెల్లడించారు.

### ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

**ఎల్కతుర్తి :** అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న మూడు ట్రాక్టర్లను సీజ్ చేసినట్లు ఎస్సై ప్రవీణ్‌కుమార్ బుధవారం తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కరీంనగర్ జిల్లా వీణవంక మండలం పోతిరెడ్డిపల్లికి చెందిన జాన అరవింద్, పైడిపెల్లి శ్రీనివాస్, బొమ్మినేని ప్రవీణ్‌కుమార్‌కు చెందిన ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్నట్లు సమాచారం వచ్చిందన్నారు. ఈ క్రమంలో పెంచికలపేట ఎక్స్‌రోడ్డు వద్ద మూడు ట్రాక్టర్లను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుక రవాణా చేసినట్లు తెలిస్తే చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

### మాందారిపేటలో షూటింగ్



**శాయంపేట :** మండలంలోని మాందారిపేట పరిసర ప్రాంతాల్లో బుధవారం ఎంఎస్ సాంగ్స్ యూట్యూబ్ ఛానల్ ఆధ్వర్యంలో అన్నాచెల్లెల రక్త సంబంధాన్ని వివరిస్తూ రాఖీ పాటను చిత్రీకరించారు. సీనియర్ కవి, రచయిత పడిదం రాజేందర్ ఈ పాట రాయగా చిత్రీకరణ చేస్తున్నట్లు కళాకారుడు మిద్దేపాక మధు తెలిపారు. సింగర్ బేరిపోతుల సంధ్య, మ్యూజిక్ డైరెక్టర్ సాయికిరణ్, కెమెరామెన్ జనార్దన్, కోరియోగ్రఫీ ప్రభ, నటులు మధు, నరేష్, ప్రతాప్, రేణుక, పాల్గొన్నారు.

## వైభవంగా పోచమ్మబోనాలు



బోనాలతో ప్రదక్షిణలు చేస్తున్న మహిళలు

**శాయంపేట :** విశ్వబ్రాహ్మణులు శ్రావణమాసాన్ని పురస్కరించుకుని మండల కేంద్రంలో బుధవారం పోచమ్మ బోనాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డప్పుచప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. గొర్రెలు, మేకలు, కోళ్లను నైవేద్యంగా సమర్పించారు.

## అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు



కమలాపూర్ : భూమిపూజ చేస్తున్న ఎంపీడీఓ బాబు



ఆత్మకూరు : భూమిపూజలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

**కమలాపూర్ :** ఇళ్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ఇటుక, ఇసుక, సిమెంట్, స్టీల్, వంటి గృహ నిర్మాణ సామగ్రిని ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ గుండె బాబు వ్యాపారులను హెచ్చరించారు. మండలంలోని దేశరాజుపల్లిలో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను బుధవారం ఆయన పరిశీలించి కొత్తగా నిర్మించే ఇళ్లకు ముగ్గపోసి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణానికి ఎంత ఇసుక, ఇటుక, సిమెంట్, స్టీల్ వంటికి అవసరమవుతున్నాయని, ఏ ధరలకు లభిస్తున్నాయని లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్లను పంచాయతీ కార్యదర్శులు నిత్యం పర్యవేక్షిస్తూ గృహ నిర్మాణ సామగ్రిని విక్రయించే ధరలను తెలుసుకోవాలని అన్నారు. ఎవరైనా అధిక ధరలకు విక్రయిస్తే వారిపై చర్యలు తీసుకోవాలని అన్నారు. ఇసుకను అధిక ధరకు విక్రయిస్తే ఆ వాహనాల నంబర్లను పోలీసులకు తెలిపి కేసు నమోదు చేస్తామని హెచ్చరించారు. మేస్త్రీ నుంచి కూలీల వరకు ప్రభుత్వం నిర్ణయించిన ధరల ప్రకారమే పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ డైరెక్టర్ సముద్రాల కృష్ణ, ఏపీఓ రమేశ్, కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

**ఆత్మకూరు :** మండల కేంద్రంలో పలువురు లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ గృహ నిర్మాణాలకు బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు భూమి పూజచేశారు. నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని లబ్ధిదారులకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, సొసైటీ డైరెక్టర్ జైపాల్‌రెడ్డి, మైనార్టీ సెల్ మండల అధ్యక్షుడు ఖాజా, నాయకులు ప్రసాద్, రవి, కేదారి, ఇందిరమ్మ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నారుమడి యాజమాన్య పద్ధతిపై అవగాహన



ఎల్కతుర్తి : అవగాహన కల్పిస్తున్న ఏఈఓ తిరుపతి



దామెర : రైతులతో మాట్లాడుతున్న ఏఈఓ

**దామెర :** వరి నారుమడి యాజమాన్య పద్ధతిపై రైతులు అవగాహన కలిగి ఉండాలని ఏఈఓ రామకృష్ణ అన్నారు. మండలంలోని పులుకుర్తి, పసరగొండలో నారుమడులను బుధవారం పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. నారుమడిని 10 నుంచి 12 రోజుల ముందే దమ్ముచేసి చదును చేసుకోవాలన్నారు. నీరు పట్టేందుకు, తీసేందుకు వీలుగా కాల్వలను ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. 5 సెంట్ల నారుమడికి 2 కిలోల నత్రజని, 1 కిలో భాస్వరం, పొటాషియానిచ్చే ఎరువులను దుక్కిలో వేయాలన్నారు. నారు పూర్తిగా పురివిచ్చుకునే వరకు ఆరు తడులు ఇచ్చి తరువాత పలుచగా నీరు నిలకట్టాలన్నారు. రైతులు రాంబాబు, భిక్షపతి, రాజు, లక్ష్మణ్, రమేశ్, పాల్గొన్నారు.

**ఎల్కతుర్తి :** సహజసిద్ధ వ్యవసాయంలో భాగంగా మండలంలోని జగన్నాథపూర్ గ్రామంలో బుధవారం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఈఓ తిరుపతి మాట్లాడుతూ.. సేంద్రియ వ్యవసాయంతో సారవంతమైన భూమి, వాతావరణం కలుషితం కాకుండా ఉంటుందని తెలిపారు. సహజసిద్ధ వ్యవసాయంలో వేపగింజల కషాయం, నీమాస్త్రం, వేస్ట్ కంపోజర్, జీవామృతం, ఘన జీవామృతం తదితర కాషాయాల తయారీ విధానం గురించి రైతులకు వివరించారు. జీల్గుల గ్రామానికి చెందిన తక్కళ్లపల్లి అయిలయ్య అనే రైతు ఆరు సంవ్సరాలుగా సహజసిద్ధ వ్యవసాయం చేస్తుండగా ఆయన అనుభవాలను ఇతర రైతులకు తెలిపారు. బీసీఐ ఫెసిలిటేటర్స్ రావుల లత, మౌనికతో పాటు రైతులు పాల్గొన్నారు.

## రైతు ఉద్యమాలకు ఓంకార్ ఆదర్శం

- ఏఐకేఎఫ్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఉపేందర్



మాట్లాడుతున్న ఉపేందర్‌రెడ్డి

**శాయంపేట :** రైతు ఉద్యమాలకు మాజీ ఎమ్మెల్యే మద్దికాయల ఓంకార్ ఆదర్శమని అఖిల భారత రైతు సమాఖ్య రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు వల్లెపు ఉపేందర్‌రెడ్డి అన్నారు. బుధవారం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధుడు మాజీ ఎమ్మెల్యే ఓంకార్ శత జయంతిలో భాగంగా మండల కేంద్రంలోని రైతు వేదికలో అఖిల భారత రైతు సమాఖ్య జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన హాజరై మాట్లాడారు. ఓంకార్ తన జీవితాన్ని పీడిత ప్రజల విముక్తి కోసం త్యాగం చేశారని అన్నారు. దున్నేవాడిదే భూమి కావాలని ఉమ్మడి వరంగల్ జిల్లాలో లక్ష 67 వేల ఎకరాల భూములను పేదలకు దక్కేలా కృషిచేశారని కొనియాడారు. ప్రస్తుతం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న రైతు వ్యతిరేక చట్టాలు, విధానాలను నిరసిస్తూ రైతాంగాన్ని ఐక్యం చేసి పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందని, ప్రతిఒక్కరూ కదలిరావాలని పిలుపునిచ్చారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఎన్‌రెడ్డి హంసారెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు మహ్మద్ ఉస్మాన్, మహేందర్‌రెడ్డి, రాజిరెడ్డి, రవీందర్, నాగార్జున, సావిత్రి, మనోధర, సతీష్, రాజమౌళి, రవీందర్, రాజేశ్వర్‌రావు, మల్లారెడ్డి, ప్రభాకర్‌రావు, భద్రయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## యువత ఆలోచనలపైనే దేశ భవిష్యత్



పరకాల : మాట్లాడుతున్న ఎస్సై విఠల్



మాట్లాడుతున్న ఏఎస్సై కుమారస్వామి

**పరకాల :** విద్యార్థులు, యువత ఆలోచన విధానంపైనే దేశ భవిష్యత్ ఆధారపడి ఉందని, చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఎస్సై విఠల్ సూచించారు. బుధవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల పాఠశాలలో ప్రహరీ క్లబ్ సమావేశం పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మధు అధ్యక్షతన వహించగా ఆయన హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యతో పాటు సమాజంపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. వ్యసనాలకు దూరంగా ఉండి, సన్మార్గంలో పయనించాలని అన్నారు. మత్తు పదార్థాలకు బానిసలైనట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని అలాంటివారికి కౌన్సెలింగ్ ఇవ్వడంతో పాటు విక్రయించేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

**సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి**

**శాయంపేట :** సైబర్ నేరాలపై విద్యార్థిని, విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై కుమారస్వామి సూచించారు. బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కళాశాలలో సైబర్ నేరాల నియంత్రణపై అవగాహన కల్పించారు. విద్యార్థులు సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడొద్దని అన్నారు. తమ తల్లిదండ్రులు వినియోగించే స్మార్ట్‌ఫోన్‌కు అపరిచితులు పంపే ఓటీపీలను స్పందించకుండా తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరానికి గురైతే వెంటనే పోలీస్‌లను సంప్రదించాలని అన్నారు. సోషల్ వెల్ఫేర్ పాఠశాల ప్రిన్సిపాల్ రజిని, హెడ్‌కానిస్టే బుల్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.